# వర్జ్యం

.....మైడియర్ మంజూ, నువ్ లక్షచెప్పు వెయ్యి చెప్పు నా ప్రయత్నం నేను చేశాను. నిజానికి అందులోనూ చొరవ తీసుకున్నాననే చెబుతున్నాను నమ్ము. నాజీవిత భాగాన్నీ, స్వామినీ ఎన్నుకోవాలనుకున్న ఓ గట్టి నిశ్చయానికి వచ్చేశాను.

నాఅన్నగారి దగ్గిర నుంచి నేను అడగకుండానే ఆశీస్సులూ, వదిన దగ్గిర నుంచి హేపీ హనీమూన్ అని తీపి తలపులూ, అమ్మ దగ్గిర నుండి ఆరోగ్యం జాగ్రత్త అని వెల్ టైమ్‌డ్ వార్నింగు అన్నీ వచ్చేశాయి.

సాయిది భేషైన ఉద్యోగం. బోనసూ, ఓటి కలిపితే నెలకు పన్నెండు వందల వరకూ కిడుతుంది. ఏ పెళ్లికూతురైనా కోరుకునే బుల్లి కారు లేకపోయినా చక్కటి స్కూటర్. అద్దెదే అయినా చక్కటి ఇల్లు. ఇక అందమంటావా? అమితాబ్ కంటె ఓఅరంగుళం పొడుగు తక్కువైనా అంతకంటె బ్రేష్ (బ్రేవ్+రాష్) ఉన్న స్కూటరబ్బాయిని ఏకన్య కాదనగలదు చెప్పు. అంతా చదివి నేను చేసినపని నీకు నచ్చుతుందో లేదో రాస్తావు కదూ!

సాయి నాకు తగిన వరుడుకాదంటే మీద చెప్పిన లక్షణాలు అతనిలో లేవని మాత్రం అనుకోకేం! నేన్నది మరికొన్ని కారణాలవల్ల . అయితేనేం నన్ను ఎవరు అర్థంచేసుకుంటారు? నాన్నగారు తిట్టలేదు కాని ఉత్తరానికి జవాబు రాయడంమానేశారు. అన్నయ్య తిడుతూరాశాడు. వదిన సరేసరి. అమ్మ నీకు మతిపోయిందా అతనితో అంత చనువుగా వున్నావని తెలిసింది? కుటుంబం మంచితనం లెక్క చెయ్య నంతటి మొటుతనం నీకెలా వచ్చింది? ఇలాంటి చీవాట్లు పెట్టి పెట్టి చివరకు తేల్చిన సారాంశం ఈ సంబంధం చేసుకోకపోతే ఇక నీపెళ్లి విషయం మేం అసలు ఎత్తనేఎత్తం-

నాకేం మహారాజునని, కాకపోతే ఓ మగ రాజుకి కాబోయే మహారాణీనని నువ్వేమో ఊ పొగడ్తలు దంచేస్తున్నావ్! అదంతా నామీద ప్రేమని నాకు తెలుసు. నిజంగా ఈ సంబంధం చేసుకుందామని నాన్న గారి గుండెల మీద కుంపటి అమ్మ నెత్తినున్న బరువూ దించేద్దామని అన్నయ్యకు నా ఎడల ఉండే కర్తవ్య నిర్వహణకి తోడ్పడుదామని వదినను బాధ్యతగల పెద్దకోడలిగా ప్రపంచానికి నిరూపిద్దామని నేను కలలు కన్నాను. పెళ్లి చేసుకోనని వెర్రి మొర్రి శపథాలు ఎప్పుడూ చెయ్యలేదు, ఇప్పుడూ చెయ్యను - లేదా మూడు పదులూ దాటి నాలుగో పది దూరంగా వెక్కిరిస్తుంటే అప్పుడు ఎంత గిజ గిజ లాడినా వచ్చేది బ్లెడ్ ప్రెషరే కాని పోయిన వయసు రాదని నాకూ తెలుసు. మూడేళ్లదే ముద్దు ముప్పయి ఏళ్ళదే ముద్దు అన్న బామ్మ మాటలు నాకు గుర్తున్నాయ్.

ఏజంటు పక్కకి పిలిచి "యూ ఆర్ ఎ లక్కి గర్ల్" అన్నాడు. నా స్వంత విషయాలు ఇతరుల దృష్టిని అంతగా ఆకర్షిస్తున్నాయని నాకు అంతగా తెలియదు, అన్నట్లు ఇప్పుడైనా అసలు విషయం చెబితే పాపం వాళ్ళమ్మాయికైనా ట్రైచేసుకుంటాడు. అమ్మాయికి ఉద్యోగం లేకపోతేనేం యాభైవేలు కట్నం పారేయనూ గలడు. లేదా ఉద్యోగం వేయించి కట్టెయ్యగలడు పిల్లిగుడ్లమ్మాయిని.

అతి చనువు అసహ్యాన్ని, పిల్లల్ని పుట్టిస్తుందన్నాడు మార్క్‌ట్వెయిన్. కాని సాయితో నాచనువు ఆసహ్యం పుట్టించడంతో ఆగిపోయింది. పిల్లల వరకు రాలేదు మా ప్రేమాయణం. కారణం నాపిడకల వేటేనని రాసింది వదిన, కసిగా.

కాని నిజం చెప్పు, నా బరువు ఎవరుమోస్తున్నారు? నాన్నగారి గుండెల మీద కుంపటికిది బరువూ లేదు. సెగలేదు. చూస్తూబ్రతుకులో దగాపడమంటే సహించేటంత దీనస్థితిలో లేను.

అసలువిషయం ఇంకా ఎత్తుకొనే లేదు. కాగితాలు నిండిపోతున్నాయి. కవరుకి స్టాంపులు ఎక్కువ అంటిచాల్సివస్తుంది నాలుగవ కాయితం పెడితే

- క్షమించు ఆ సాయితో పరిచయం ఆర్నెల్లు సావాసం చేస్తే వారు వీరవుతారంటారు - ఆరు వారాలకే సాయి మాటలు నాకు అలవాటయి పోయాయనిపిస్తోంది.

సాయి సంబంధం నాకు సజెస్ట్ చేసింది మా ఆఫీసులో నాతోపాటు పనిచేసే పేరమ్మ.

"పిచ్చిమొద్దా మీవాళ్లేనే - ఎంచక్కా ఒహటే ఆఫీసులో ఉద్యోగం....". అప్పటికి సాయితో అట్టే పరిచయం లేదు నాకు. లంచ్ టైమ్‌లో అడపాదడపా వచ్చి నా ఎదురుగా ఉన్న మరో అబ్బాయితో మాట్లాడుతూ ఉండేవాడు. నేను అట్టే పట్టించుకునే దాన్నికాదు. నాసంగతి తెలుసుగా.

పేరమ్మ అసలు పేరు ప్రేమసఖి. ఛీ నేనెంత కృతఘ్నురాలిని? నాకు సంబంధం చూసిన నేరానికి దాన్ని పేరమ్మను చేసేశా. సారీ! ఈ ఉత్తరం కనక దానికంట పడిందా నేను ఎంతో అందంగా ఉన్నాయనుకుంటున్న నాబుగ్గలు రక్కేస్తుంది. ఆమె భర్త మోహన్ కుమార్‌తో ఏం చెప్పి ఏం చేసిందో నాటేబుల్ దగ్గరకు రావటం నేను ముభావంగా ఉండడం కొంత కాలం తర్వాత కర్టెసీ కోసం మాట్లాడ్డంతో ప్రారంభ మైంది మా పరిచయం.

ఆఫీసులో చూసిన మనిషికీ ఇంటి దగ్గర మనిషికీ చాల తేడా ఉంది సుమా! మరీ కలలు కంటే ఏడుపురాక నవ్వు వస్తుందా? అలా అన్నానని ఏడుస్తున్నాని మాత్రం అనుకోకేం?

వెనక ఏం జరిగిందో తెలియదు (బహుశః మోహన్ కుమార్ ఓ వంద బెట్ చేసి ఉంటాడు ఆఅమ్మాయిని సినిమాకు తీసుకు వెళ్ళితే వంద ప్రేమ సఖి హస్బెండ్ అలాగే మాట్లాడుతాడు) ఓరోజు సాయంకాలం సినిమా ప్రపోజ్ చేశాడు సాయి నేను కాదనలేదు.

గుడ్లప్పగించి తెరవంక చూస్తూ కూచోడం నాకు ఎంత విసుగో నీకు తెలుసు. వెనక కుర్చీలలో వాళ్ళు మనం కాలేజీలో చదివే రోజుల్లో సీట్లు మారిపోయేవారు గుర్తుందా? సినిమా బోరుకొట్టి నేను అటూఇటూ చీకట్లోకి చూస్తూ కూచున్నా.

సినిమా తర్వాత వాళ్లరూమ్‌కి రమ్మని ప్రపోజ్ చేశాడు సాయి. నిజంగా చెబుతున్నా నాకు గుండె దడ దడ లాడలేదు. సరేనన్నా.

'ఆటో' కేకేశాడు సాయి.

స్కూటర్ మోహన్ కుమార్ పట్టుకు పోయాడట దేవాంతకుడులే,

"ఆడవాళ్లు పక్కనుంటే సినిమా టికెట్లు ఇట్టే దొరుకుతాయి. భలే ఎడ్వాంటేజ్" అన్నాడు తీరా సినిమా చూసేశాక - నేను తేలికగా నవ్వేశాను.

ఆటో ఎక్కాం.

"చీర జాగ్రత్త సుమండీ" ఓ కాషనిచ్చి ఏ ఏ సందుల్లోంచి పోతే షార్టుకట్టో ముందుకు వంగి డ్రైవర్‌కి డైరెక్షన్స్ ఇస్తున్నాడు సాయి.

టర్నింగ్‌లో నేను అతని మీద పడిపోయా, అదేనే బండి కుదుపుకి

"సారీ" అంటే "దట్సాల్‌రైట్" అనలేదు సరికదా. నిజంగా నేను ఎంతో విచారించేసినట్టు గట్టిగా పట్టుకొని ఆటోలో ఎలా కూచోవాలో చిన్న లెక్చర్ గొంతు ఇంజన్‌మోతకంటే ఓ స్థాయి పెద్దది పెట్టి ఇచ్చేశాడు.

అతని ఇల్లు చూశాక అతని మీద ఆశంటూ లేశమైనా ఉంటే అదీ పోయింది, బ్యాచిలర్ క్వార్టర్స్ అంటే ఎలా ఉంటుందో అనుకున్నాను. గోడలమీద పిన్‌అప్స్ ఊహించలేకపోయినా హేమమాలిని. జయబాధురీ, జయప్రదా, జ...ఇల్లాంటివైనా వుంటాయనుకున్నాను. మంచం పక్క టీపాయ్ మీద వాళ్ల బామ్మదట ఓ ఫోటో అదితప్ప ఫోటోలు లేనేలేవు.

పదేళ్ళే సంసారం చేస్తున్న అటు అక్కయ్యగాని, పదేహేనేళ్లయి సంసారం చేస్తున్న వదినగాని, అంతెందుకు అమ్మైనా ఇల్లు అలా సర్దలేదు.

ముందు డ్రాయింగ్ కమ్ బెడ్ రూమ్, వెనక కిచన్ ఆవెనక బాత్ అండ్ లేవటరీ.

"మీరు వెళతారా!" అన్నాడు సాయి గుడ్లు మిటకరిస్తూ డ్రాయింగ్ రూమ్‌లో నుంచున్న నేను బాత్‌రూమ్‌లోకి వెళ్ళాను, కళ్లు చెదరిపోయేటట్టుంది. అంత ఆకర్షణీయంగా బాత్‌రూమ్‌నుకూడా ఉంచుకో కలిగిన బ్యాచిలర్స్ ఉంటారని నేను అనుకోలేదు.

-ఇక భోజనం.

"మెంతి వంకాయ కూరంటే నాకు భలే ఇష్టం. ఈసైజుకాయ దొరికితే రెండు పూటలకి ఒకేసారి వండేసు కుంటా. చల్లారిందని ఆక్షేపణేంలేదు నాకు. మెంతులు జీలకర్ర కాస్త ఇంగువా, శెనగపప్పు! శెనగపప్పు దోరగా వేయించి బద్దలు బద్దలుగా ఉంటేనే కమ్మగా ఉంటుంది - ఇంకొంచెం వేసుకోండి గుంటూరు నెయ్యి, ప్రత్యేకం నారాయణ గూడా నుంచి స్టీలు క్యారియర్లో - ఈ క్యారియర్ చూశారా, కేరకాస్నిటాల్ స్కీమ్‌లో టిక్కెట్టు అమ్మి ఫ్రీగా సంపాదించుకున్నది ఏదో కాలక్షేపం ఆడవాళ్లయితే ఇంకా తేలికగా చెయ్యవచ్చు ఇలాంటి పనులు."

- నాకు గొంతు అడ్డంపడినట్లయింది, ముద్దదిగలేదు. నేను సంభాషణలో జొరబడడానికి ఏదైనా అవకాశం కోసం చూస్తున్నాను. దిండు గలేబుమీద ఎంబ్రాయిడరీ - "ఈ ఎంబ్రాయిడరీ., మీసిస్టర్ .....?" "అబ్బే నాకు అక్కచెల్లెళ్ళు లేరండి నేను కుట్టుకున్నవే....క్రోషియాతో అయితే ఇంకా బాగా వెయ్యవచ్చు. మోడిసిల్కుత్రెడ్ ... ఆరోజులలో రూపాయి ఉండేది రీలు. ఇప్పుడు చాలా ఉంటుంది.

-నేను మళ్ళీ గ్రుడ్లు మిటకరించటం ప్రారంభించాను. "అరెరే తినడం మానేసి అలా చూస్తారేం? నాకు ఇదొక చెడ్డ అలవాటు. కబుర్లు చెబుతూనే గబగబా తినేస్తాను. నాతో పాటు కూచున్నవాళ్ళు కబుర్లువింటూ కంచంలో చెయ్యి అలానే ఉంటుంది నేను కొండ కొట్టేస్తా....ఇంకేం మాటాడను. మీరు భోజనం కానియ్యండి....సాంబారు రుచిగా ఉందా సాంబారుపొడి ఇంట్లో చేసుకుంటే గాని బావుండదు. పుస్తకం చదివి నేర్చుకున్నదే ననుకోండి. అరెరె సారీ ఉండండి"

మళ్ళీ ముద్ద గొంతులో అడ్డేసింది నాకు.

సాయి దబుక్కున లేచి సిమ్మెంటు షెల్ఫ్ మీదనున్న తళ తళ లాడుతున్న బోర్నవిటా డబ్బా తీశాడు.

-"తేంగళ్" అని మహారాష్ట్ర లంటారు. "శెనగపప్పు పెసర పప్పు..."

- నేనింక వినదలచుకోలేదు.

నాకు కాబోయే భర్త నామీద ఎంత ఆధారపడితే నాకు అంతతృప్తి. సుశీ, ఆబ్లేడెక్కడ? షర్ట్ కప్‌లింక్స్ కనపడవేం? టైలన్నీ నలిగిపోయాయ్ సుమా! రుమాలు లేదు తీరా ఆఫీసులో చూసుకున్నా....నువ్ పంపిన సాంబారు బావుందిసుమాగిన్నె ఎత్తుకు తాగేశాడు రావ్ .....(అయ్యోరాత పొద్దున్న తొందర్లో ఉప్పు వెయ్యడం మరిచిపోయానండి) - ఇలాంటి డయలాగులు ఊహించు కుంటున్న నాకు మాత్రం కడుపులో దేవేస్తున్నట్టనిపించింది.

"తేంగేళ్" ఇన్ని ఓ పెద్ద స్పూన్ తీసి నాప్లేట్లో వేశాడు సాయి. అసలే మింగబడడంలేదు గొంతు తడి ఆరిపోయింది.

"గాజులు చాలా బాగున్నాయండి భగన్‌లాల్ షోకేసులో చూశా"

"సెక్రటరీ గాజులు"

"అబ్బా సినిమాగాజులా......

"సినిమాలంటె నాకు మహాబోర్ మహిళా జనరచయితలూ, నిర్మాతలూ, అన్నీ ఒకటి చూస్తే వందమరి చూడక్కరలేదు...."

"ఇంతకీ మీరేం చూశారు?"

"మాయాబజారు....."

- ఇంక సినిమా గురించి నేను మాట్లాడలేదు. ఏదో ధైర్యం వచ్చింది "స్టాఫ్ క్లబ్‌లో టెన్నీస్ ఆడతారా"

- ప్రశ్న బయటకి వచ్చేశాక ఇంకా ఆశ్చర్యం! అంత ధైర్యం నాకెలా వచ్చిందని, ఠక్కున జ్ఞాపకం వచ్చింది ఓ పాతడయలాగ్ "డామిట్ కథ అడ్డం తిరిగింది."

వెధవ కథ అడ్డం ఎలానూ తిరిగింది -

"అబ్బే గేమ్సంటే నాకు ఇష్టం లేదండి"

- మరి చేగోడీలో ....అనేద్దామనుకున్నా కాని అతన్ని చూసి నాకు బోల్డు జాలి.

"క్రికెట్ కామెంటరీ?"

"అబ్బ గోల గోల"

"టూబిట్స్ అయితే ఎనభై ఆరుంటుంది నైలక్స్ ఊలి ప్రింటెడ్ ప్లవర్ ఇంకొంచెం పెద్దవై ఉంటే ఇంకా...."

- మాట మార్చేశాను "ఇల్లు చాలా నీటుగా ఉంచారే...ఎక్కడ చూసినా సిగరెట్ను దుమ్ము...అవీ ఉంటాయనుకున్నా"

"అబ్బే నేను సిగరెట్లు కాల్చనండి రోజుకి ఓ పేకెట్టు కాల్చినా నెలకి ముప్పై...."

-కాలేజీ రోజుల్లో ఇంగ్లీషు డిపార్ట్‌మెంట్‌లో ఒకతనుండే వాడు జ్ఞాకంఉందా? చిమ్నీ అని పేరు పెట్టింది జూలీ....గోల్డుఫ్లెక్ గుప్ గుప్ లాగిస్తుంటే ఘుమ ఘుమ లాడిపోయేదని జూలీ అంటుండేది- అసలు సిగరెట్లు కాల్చని మగాడు ఒక మగాడేనా అని.

బాగా ప్రొద్దు పోయిందని చెప్పి లేచాను నేను.

"నిజమే మళ్ళీ ప్రొద్దున్నే లేచి వంటా అది చూసుకుని బ్యాంకుకి తయారుకావాలి మరి."

-నేను తాజ్ నుంచి క్యారియర్ తెప్పించుకుంటున్నాని అతనికిచెప్పవలసిన అవసరం నాకు కన్పించలేదు.

నేను కన్న కలలన్నీ బంగారు కలలై కరిగిపోయాయి. అతనితో కాపురం నైట్‌మేర్. రంగుల కలే నయం పీడకలకంటే!

ఆడదానితో ఏంకాపురం చేస్తానే మంజూ - ఇంకా ఇరవై నాలుగేకదా, మరో ఆరేళ్ళలో మంచి సంబంధం దొరక్కపోతుందా?

నువ్వే నా నన్ను అర్థం చేసుకుంటే అదే పదివేలు నాకు ఈ సంబంధం వద్దు - నన్ను నువ్వైనా క్షమిస్తావా?

నీ సుశీ.

కడలి, సెప్టెంబర్, 75